రేసుకోర్సులో గుర్రాలకు గుర్రాలే పరుగెత్తుతాయనే గాఢమైన నమ్మకంగల వ్యక్తి హయగ్రీవమూర్తి. ఆ నమ్మకంతోనే ఎ.జి. ఆఫీసులో యు.డి.సీగా చేరినదగ్గర్నుంచి ప్రతి సీజనుకూ హాజరవుతూ స్వగ్రామంలో తరి మాగాణి మూడెకరాలు అమ్మాడు; భార్య కట్నంగా పేణా తెచ్చిన నలభై వేల రూపాయల్ని నామరూపాల్లేకుండా చేశాడు; పై పెచ్చు అప్పుల్లో గొంతువరకూ మునిగాడు. ఫస్టుతారీకున రేసులంటే - జీతం సొంతం ఇంటికి చేరుతుందనే నమ్మకం ఏకోశానా లేదు. రెండో తారీఖున అప్పులకు ఎగబడిన రోజులు ఎన్నో ఉన్నాయి. మరి. అయినప్పటికీ ఏదో ఒక రోజున తాను లక్షరూపాయల 'జాక్‌పాట్' కొడతాననీ, ఆనాడు పార్టీ ఇచ్చే గుర్రంమీద వేలకొద్దీ గెలుస్తాననే విశ్వాసం హయగ్రీవమూర్తి నరనరాల్లో పొర్లుతూనే వుంటుంది. అందుచేతనే అతను పురచేత్తో ఆఫీసుకు సెలవుచీటీ అయినా రాస్తాడు గానీ, రేసుకోర్సుకు పోవడం మానడు. ఏ రోజు మానేస్తే, ఆరోజే తన అప్‌సెట్ హార్సులు గెలుస్తాయని భయం.

ఆరోజు సాయంకాలం ఆఫీసునుంచి వస్తూవస్తూ శనివారంనాటి రేసు బుక్కు తెచ్చుకున్నాడు హయగ్రీవమూర్తి. జేబులో పట్టుమని పది రూపాయలు కూడా లేవు. నెల ఆఖరి వారం. రేపు మధ్యాహ్నంలోపల సొమ్ము దొరకదా? ఈ లోపల లెక్కలువేసి వుంచితే పోయేదేముంది? అనుకున్నాడు.

ఆ రాత్రి పెందలాడే భోంచేసి, ట్యూబులైటుకింద చాపవేసుకుని, రేసు బుక్కు, ఎక్స్‌పర్‌సైజు బుక్కు, రేసు రికార్డూ పెట్టుకుని కూర్చున్నాడు హయగ్రీవమూర్తి.

"నా మెడలో మంగళసూత్రం తప్ప, ఇంట్లో పైసా లేదు" అంది భార్య అతని అవస్థ చూసి.

ఆ మాటల్ని వినిపించుకోలేదు హయగ్రీవమూర్తి క్లాసు 'బి' గుర్రాల 'ట్రాక్' వర్కు చూస్తూ.

పదకొండుగంటలకు టీ తాగి, మళ్ళీ కాలుక్యులేషన్లమీద కూర్చున్నాడు హయగ్రీవమూర్తి. అర్ధరాత్రి అతనెప్పుడు పడుకున్నాడో అతని భార్యకు అంతు లేదు.

ఉదయం హయగ్రీవమూర్తికి మెలకువ రాకముందే. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో మామగారు దిగారు. వచ్చీ రావడంతోనే, "ఇదుగో అమ్మాయ్ ఈ నాలుగువేలు వుంచు. వంటశాలూకు డబ్బు" అంటూ కాగితంలో చుట్టిన కట్టను కూతురుకు ఆప్యాయంగా అందించాడు ఆ పెద్దమనిషి.

హయగ్రీవమూర్తి భార్య గుండెలో భయం గుబ్బుమంది - ఆ మాటలు భర్త ఎక్కడ విన్నాడో, ఆ సొమ్ము అందించడం ఎక్కడ చూశాడోనని. కాని హయగ్రీవమూర్తి ముసుగు తన్ని పెట్టుకునే వున్నాడు.

బీరువాలో దాస్తే భర్తకంట ఎక్కడ పడుతుందోనని పాపం ఆ ఇల్లాలు ఆ డబ్బుకట్టను బాత్‌రూమ్‌లో విడిచిన గుడ్డలపెట్టెలో దాచింది.

తొమ్మిదిగంటలకు నిద్రలేచిన హయగ్రీవమూర్తి మామగారిని క్షేమ సమాచారాలు అడిగి, 'హిందూ' పేపరు ముందువేసుక్కూర్చున్నాడు. 'హిందూ సెలక్షను, డేన్ బెస్ట్, డబుల్ వర్ ది రేసు రేసుబుక్కులో నోట్‌చేసుకున్నాడు: తన కాలిక్యులేషన్ప్రకారం వచ్చిన గుర్రాలకూ, 'హిందూ' సెలక్షన్లకు ఎంతో తేడా వుంది. ఆ పేపర్ను తిట్టుకున్నాడు. పన్నెండు గంటల ప్రాంతాన స్నానంచేసి, ఇస్త్రీ చేసిన దుస్తులు ధరించి. భోజనంచేసి, భార్యతో మాటమాత్రం చెప్పకుండా గడపదాటి, రోడ్డుమీద ఆటో ఎక్కి, "మలక్‌పేట రేసుకోర్సుకు" అన్నాడు హయగ్రీవమూర్తి దర్జాగా సిగరెట్టు వెలిగిస్తూ.

జేబులో పది రూపాయలు కూడా లేకుండా 'జై' మంటూ మొగుడు రేసుబుక్కును ప్యాంటుజేబులో కుక్కుకుని వెళ్ళినందుకు హయగ్రీవమూర్తి భార్య గడ్డంకింద అరచేతిని పెట్టుకొని అదేపనిగా ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత బాత్‌రూమ్‌లో విడిచినబట్టల పెట్టెలో వంటడబ్బు తాలూకు పైకం పేపరుకట్ట కనబడక పోయేటప్పటికి, 'అమ్మో! నాయనో!' అంటూ అంకిళ్ళు వొక్కుకుపోయేట్టు కేకలు పెట్టింది.

అక్కడ మలక్‌పేట రేసుకోర్సులో రింగ్‌లో 'బ్లూహెవన్' గుర్రంమీద అయిదొందరు రూపాయలు ఒన్ టు త్రీ ఆడ్స్‌లో ఆడి, బెల్ మోగగా పన్నెండొందల మీటర్లు పరుగెత్తే గుర్రాన్ని చూడటానికి రేస్‌ట్రాక్ ఫెన్సింగ్‌దగ్గరకు పరుగెత్తాడు హయగ్రీవమూర్తి. అతనితోపాటు పోర్‌కాస్ట్, క్వినిల్లాలు బెటింగ్ ఆడిన రేసుగోయర్స్ ఎంతోమంది అదుర్దాను అరికాళ్ళలో పెట్టుకొని పరుగెత్తే గుర్రాల్ని చూడటానికి తామూ పరుగెత్తుకొచ్చారు.

త్రీ లెంగ్త్సులో 'బ్లూహెవన్' సెకండయింది. హయగ్రీవమూర్తి ఒంటి నిండా చెమట్లుపట్టాయి- అయిదొందలు అడ్రసులేకుండా పోయినందుకు.

మళ్ళీ ఆశాజ్యోతి వెలుగులో అంతలోనే ధైర్యం తెచ్చుకొని, ఫేవరేట్లూ, అపెసెట్లూ కలిపి, ఆ రోజు జాక్‌పాట్ సొమ్మంతా తనకే రావాలనే ప్రగాఢ కాంక్షతో ఏడవందల ఇరవై రూపాయలతో జాక్‌పాట్ కాంబినేషన్ తీశాడు. ఆ రేసులో ఎయిట్‌టై టెన్ ఫేవరేట్‌మీద వెయ్యిరూపాయలు కాశాడు. 'మీట్ మిడ్ నైట్' అనే క్లాసు టు గుర్రంమీద. హయగ్రీవమూర్తి అదృష్టానికి అంగబలం లేక ఆ గుర్రం బోర్డుఎక్కలేదు. జాక్‌పాట్ కాంబినేషన్‌కు ఆదిలోనే అంటే మొదటి లెగ్‌లోనే పంధికొట్టింది. ఆ కాగితాన్ని కసికొద్దీ చించి, అరవైనాలుగు ముక్కలుచేసి గాలిలో ఎగరవేశాడు. తర్వాత ఎవరో మిత్రుడు చెప్పాడు- హాట్ ఫేవరేట్ అయిన ఆ గుర్రాన్ని గెలిపించొద్దని ఓనర్ ట్రయినర్‌తో చెప్పగా, ట్రయినర్ జాకీకి ఆ విధంగా చెప్పారట. ఆ గుర్రాన్ని బెండ్‌దగ్గర జాకీ నేర్పుగా లాగాడట.

ఎదురుతిరిగిన అదృష్టానికి ఏడుస్తూ మూడో రేసు జోలికి వెళ్ళలేదు హయగ్రీవమూర్తి. జేబులో మిగిలిన డబ్బు లెక్క చూసుకున్నాడు. నాలుగో రేసులో తనకి లెక్కల్లో వస్తుగా వచ్చిన గుర్రంపై, ఇదివరకు ఆరొందల మీటర్లదాకా ఫార్వర్డ్‌రన్ ఇచ్చిన గుర్రంపై, ఒన్ టు టెన్ ఆడ్సు పెరిగిన గుర్రంపై, 'డార్క్ హార్స్' అని ఓ రేసుబుక్ ఇచ్చిన గుర్రంపై- జేబులో పదిరూపాయలు ఆటో ఖర్చుకు వుంచుకొని, మిగతా డబ్బంతా కాశాడు రికవరీ చాన్సుకోసం. ఆ గుర్రం 'ఆల్సో రాన్' అనే రీతిలో ఎనిమిదో ప్లేసులో విన్నింగ్‌పోస్టు దాటింది. 'రెడ్ ఫ్లవర్' అనే మరో డార్క్‌హార్స్ ఫేవరేట్‌తో పోటీపడి, ఫోటోఫినిష్‌లో షార్ట్‌హెడ్‌తో నెగ్గింది.

పునాదిలేని హయగ్రీవమూర్తి ఆశాసౌధం టప్పున కూలిపోయింది. రక్తనాళాల్లో సర్క్యులేషన్ తగ్గగా నీరసంగా బెంచీమీద కూలబడ్డాడు-రేసు ట్రాక్‌కు ఎదురుగ్గా వున్న షెడ్డులో.

మైక్‌లో అనౌన్స్‌మెంట్లు జరుగుతున్నాయి.

గుర్రప్పందాల ఆటగాళ్ళు అటూ ఇటూ హడావుడిగా పరుగెత్తుతున్నారు ఎండమావుల్ని వేటాడుతున్నట్టు....

హార్స్ ఓనర్ల మోసం, ట్రయినర్ల లాలూచీ, జాకీలు కూడబలుక్కోవడం, బుక్కీల మోసం, అంతా దగా....

గుర్రాలు పరుగెత్తుతున్నాయి....

ఆ పరుగులు కాలుక్యులేషన్లను తల్లకిందులు చేస్తున్నాయి....

పంటర్స్ కోపంతో గుర్రాల్నీ, ఓనర్లనూ, ట్రయినర్లనూ, జాకీలనూ తిట్టిపోస్తున్నారు....

—అయినా అక్కడ చేరిన మనుషులు నష్టాల పీడను వెంటాడుతూనే వున్నారు....

అదృష్ట దురదృష్టాల కూడలి స్థలంలో కోలాహలంగా కేకలు, పరుగులు, చప్పట్లు, ఈలలు, లేచి నుంచోవడాలు, గంతులు, కేరింతలు, నిరాశలు, నిస్పృహలు, నెత్తిన జేబురుమాళ్ళు వేసుకోవడాలు....

—జేబులు ఖాళీ అయిన హయగ్రీవమూర్తి రేసుకోర్సు దృశ్యాన్ని తీరిగ్గా తిలకిస్తున్నాడు.

దొంగతనంచేసి భార్య పొలంతాలూకు పంటడబ్బుతెచ్చి, రెండుగంటల్లో రేసుకోర్సుకు ధారబోసి, జీవితంపై వైరాగ్యంతో ఆ దృశ్యాన్ని తిలకిస్తూన్న హయగ్రీవమూర్తికి హఠాత్తుగా ఇల్లూ, ఇల్లాలూ గుర్తుకొచ్చి - తాను ఇంటికి వెళ్ళడమా, ఏ చెట్టుకైనా ఉరేసుకోవడమా, ఏది మంచిది అనే ప్రశ్న తలెత్తింది.

*గుర్రప్పందాలలో గుర్రాలు కాదు పరుగెత్తేది -*
*వాటికి సంబంధించిన మనుషులు.*

త్వరలో

సుప్రసిద్ధ నవలా రచయిత

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తిగారి నవల

**సమాధానం చెప్పండి!**

సీరియల్‌గా వెలువడుతుంది.

ఇది హుషారు జీవుల ప్రణయోల్లాసం

విషాదాశ్రుకణ ప్రళయోద్వేగం

అన్ని రకాల పాఠకుల్ని అత్యద్భుతంగా

ఆకర్షించి, ఆకట్టుకొనే నవల